క్లుప్తంగా

కొత్త రేషన్ కార్డులు మంజూరు

తహసీల్దార్ పర్వీన్ షేక్



పర్వీన్ షేక్
తహసీల్దార్

హత్నూర(సంగారెడ్డి): ప్రభుత్వం నూతనంగా హత్నూర మండలానికి 2300 రేషన్ కార్డులను మంజూరు చేసిందని తహసీల్దార్ పర్వీన్ షేక్ తెలిపారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వడంతో కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇప్పటికే ప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయానికి అందించినట్లు తెలియజేశారు. వీటిని త్వరలోనే లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు జిల్లా కలెక్టర్ ద్వారా సమయం తీసుకుంటున్నామని తెలిపారు. కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి సమయం తీసుకుని వారి ద్వారా లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేస్తామన్నారు. ఇంకా గ్రామాలలో రేషన్ కార్డు లేని లబ్ధిదారులు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని రేషన్ కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ అని తహసీల్దార్ వివరించారు.

బాధితుడికి పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న శివకుమార్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని హద్నూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బక్కారెడ్డి శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు బక్కారెడ్డి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నర్సింహగౌడ్, ప్రభుపాటిల్, రాజ్‌కుమార్, ప్రవీణ్ కుమార్, అశోక్ పాటిల్, సలీం, మహేశ్, శివానంద్, శివకుమార్ ఉన్నారు.

కొనసాగుతున్న నిరసనలు



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్‌యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలు 173వ రోజుకు చేరుకున్నారు. ఆదివారం రిలే నిరాహార దీక్ష శిబిరంలో స్థానిక మహిళలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటును విరమించే వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

షేక్ ఫరీద్‌కు సన్మానం



షేక్ ఫరీద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

జహీరాబాద్: హజ్ యాత్రను ముగించుకుని వచ్చిన డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్‌ను ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ఘనంగా సత్కరించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

పరిచయ వేదికకు అనూహ్య స్పందన



పరిచయ వేదికకు హాజరైన వీరశైవలింగాయత్‌లు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన వీరశైవ లింగాయత్, జంగమ సమాజం వివాహ పరిచయ వేదికకు భారీ స్పందన వచ్చింది. వీరశైవ లింగయత్, లింగ బలిజ, జంగమ సమాజంలో పెళ్లికావాల్సిన వధువరులు పెద్ద సంఖ్యలో వచ్చారు. పక్కనున్న కర్నాటక రాష్ట్రం నుంచి కూడా వివాహ వేదికకు హాజరయ్యారు. 400 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

వీధికుక్కల వీర విహారం

- దాడిచేసి గాయపరుస్తున్నాయ్
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు



కుక్కల దాడిలో గాయపడిన నిఖిత(ఫైల్)



పట్టణంలో సంచరిస్తున్న కుక్కలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని డ్రీమ్ ఇండియా కాలనీలో శుక్రవారం నిఖిత(8) అనే పాపపై ఒక్కసారిగా వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కాళ్ల పిక్కలు, వీపుపైన తీవ్రంగా గాయాలయ్యాయి. పాపను జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఇటీవల మొగుడంపల్లి మండలం పడియాల్ తండాకు చెందిన నరేష్ చౌవాన్(15) స్కూల్‌కు వస్తుండగా కుక్కలు దాడి చేయడంతో గాయపడ్డాడు. మండల కేంద్రమైన మొగుడంపల్లిలో వీధిలో ఆడుకుంటున్న అజామ్(8)అనే బాలుడిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. కోహీర్ మండలంలోని పిచరాగడి తదితర గ్రామాల్లో కూడా వీధి కుక్కలు ప్రజలపై దాడులు చేసిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇలా జహీరాబాద్ నియోజకవర్గంలో కుక్కల దాడిలో గాయపడిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. నియోజకవర్గంలో వీధి కుక్కల బెడద రోజు రోజుకు అధికమవుతుంది. కుక్కల సమస్యలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పలు సందర్భాల్లో చిన్న పిల్లలపై దాడులు చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ చిన్న పిల్లలు కనిపిస్తే వారిపై దాడి చేస్తున్నాయి. జహీరాబాద్ మున్సిపాలిటీలో కూడా కుక్కల బెడద రోజు రోజుకు ఎక్కువవుతుంది. కుక్కల సమస్యతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గతంలో ఫిర్యాదు రావడంతో కుక్కలు, పందులను పట్టుకుని వాహనాల్లో తరలించారు. కానీ ఈ సంవత్సరం ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో పట్టణంలో ఎక్కడ చూసి కుక్కల మందలు మందలుగా కనిపిస్తున్నాయి. కుక్కల బెడద నివారించాలని ప్రతి రోజు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు వస్తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడదను తొలగించాలని కోరుతున్నారు.

గుంపులుగా తిరుగుతూ..

ఝరాసంగం : కుక్కలు ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. ఆదివారం మండల కేంద్రమైన ఝరాసంగం ప్రధాన రహదారిపై కుక్కలు గుంపులుగుంపులుగా తిరుగుతే ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనదారులను వెంబడిస్తున్నాయి. ఆదివారం ఝరాసంగంలో చిన్నారులను వెంబడించడంతో భయాందోళనకు గురయ్యారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఝరాసంగంలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

ఆలయాల అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలోని నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకార అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా నిర్మించిన బీరప్పస్వామి దేవాలయంలో ఆదివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయ నిర్మాణానికి పది లక్షల రూపాయల విరాళం అందించామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం వ్యాప్తంగా ఇప్పటివరకు సొంత నిధులతో 200లకు పైగా ఆలయాలు నిర్మించడంతో పాటు ప్రతి ఒక్కరిలో పరమత సహనం పెంపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, దశరథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు చేపట్టండి

సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పటాన్‌చెరు: పటాన్‌చెరు నుంచి ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ వెళ్లే ఆర్అండ్‌బీ రహదారికి వెంటనే మరమ్మతులు చేయాలని సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు జిల్లా అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం శ్రామిక్‌భవన్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంద్రేశం మీదుగా వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వర్షపు నీరు గుంతల్లో నిల్వడంతో ప్రమాదాల బారిన పడి గాయాలు పాలవుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శాంతకుమార్, పెంటయ్య, శ్రీనివాస్ ,రాజయ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: పెరుగుతున్న కాలుష్యానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని బాలుర ఉన్నత పాఠశాలలో శ్రీ సత్యసాయి సేవ సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పర్యావరణం పరంగా మారుతున్న తీవ్ర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పటాన్‌చెరు బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ నాగరాజు యాదవ్, శాంతినగర్, శ్రీనగర్ కాలనీల అధ్యక్షుడు అంజిరెడ్డి, పవన్‌కల్యాణ్ అధ్యక్షుడు సత్యనారాయణ, రాజు అజ్మత్, అఫ్జల్ పాల్గొన్నారు.

శివాలయ గడపల ప్రతిష్ఠాపన



పూజలు నిర్వహిస్తున్న రవీందర్‌గౌడ్ దంపతులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలోని తాబేలు గుట్టపై నూతనంగా నిర్మిస్తున్న జీవన జోతిర్లింగ శివాలయం, వినాయక, భ్రమరాంబిక అమ్మవార్ల గర్భగుడి గడప ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గర్భగుడి దాత మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ దంపతులు అర్చకుల వేదమంత్రాల మధ్యన పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. అలాగే బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మ బస్తీలో పునర్నిర్మిస్తున్న నల్ల పోచమ్మ ఆలయ గడప ప్రతిష్ఠాపన ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రోజాబాల్ రెడ్డి దంపతులు, దాతలు స్థానిక పెద్దలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు.

వచ్చే నెల 2న యోగా పోటీలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 2న సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియం సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగానికి యోగాసన ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రమేష్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే వారు ఆగస్టు 2వ తేదీ ఉ.10 గంటలకు బోనాఫైడ్ , ఆధార్ కార్డులతో రిపోర్ట్ చేయాలని సూచించారు. సబ్‌జూనియర్ విభాగంలో 10 -14 సంవత్సరాలు, జూనియర్ విభాగంలో 14-18 సంవత్సరాలు, సీనియర్ విభాగంలో 18-28 సంవత్సరాలు, సీనియర్ ఏ,బీ,సీ విభాగంలో 28 - 55 సంవత్సరాలు వయసు వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

చినుకుపడితే మురుగుతో సహవాసం



ఆర్టీసీ కాలనీలో రోడ్లపై నిలిచిన మురికినీరు

సంగారెడ్డి టౌన్: పట్టణంలో చినుకుపడిందంటే ఆయా కాలనీల రోడ్లు నీటితో నిండిపోతున్నాయి. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఉన్న తొమ్మిదవ వార్డు ఆర్టీసీ కాలనీలో వర్షం పడిందంటే చాలు మురికి ఇళ్లు ముందుకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. మళ్లీవర్షం తగ్గేవరకు ఆ మురికి నీటితోనే సహవాసం చేస్తూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని మురికినీరు పక్కనే ఉన్న చెరువులోకి చేరడం. వర్షపు నీరు అందులో కలవడంతో చెరువు నిండి ఆ నీరు రోడ్లపై ప్రవహిస్తూ ఇళ్ల ఎదుట చేరుతుంది. గత నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఇళ్ల ఎదుట నీళ్లు చేరి పాములు, పురుగులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర దుర్గంధంతో సాయంత్రం అయిందంటే దోమల బెడదతో ఇంట్లోఉండలేని పరిస్థితి దాపురించిందని వాపోయారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా, మున్సిపల్ అధికారులు స్పందించి మురికినీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆలయాలు ముస్తాబు**

నారాయణఖేడ్: అత్యంత పవిత్రమైన, శివుడికి ప్రీతి పాత్రమైన శ్రావణమాసం సందర్భంగా లోక కళ్యాణార్థం పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. రానున్న ఐదు సోమవారాల్లో వివిధ శైవ క్షేత్రాలు, హనుమాన్ ఆలయాల్లో భస్మహారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఖేడ్ పట్టణ పురోహితులు మలమంచి గురురాజ శర్మ తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బోలా శంకరుడి కృపకు పాత్రులు కావాలని ఆయా ఆలయాల కమిటీల బాధ్యులు కోరారు.

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ**

నారాయణఖేడ్: మండలం పరిధి తుర్కాపల్లి తండాకు చెందిన సీత్యానాయక్‌కు ఆస్పత్రి ఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి రూ.30 వేలు మంజూరయ్యాయి. సంబంధించిన చెక్కును ఆదివారం ఖేడ్‌లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు. నాయకులు నెహ్రూ నాయక్, శంకర్ ముదిరాజ్, సంగ్రామ్ రాథోడ్ పాల్గొన్నారు.

◆ **మన్‌కీ బాత్ వీక్షణ**

జిన్నారం (పటాన్‌చెరు): ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ 124 కార్యక్రమం జిల్లా అధ్యక్షురాలు గోదావరి, మండల అధ్యక్షుడు ఐలయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక్ష ప్రసారం వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని సలహాలు, సూచనలను ఆసక్తిగా తిలకించారు. విజ్ఞానం, క్రీడలు, సంస్కృతిక భారత్ అనే అంశాలపై ప్రధాని ప్రసంగం కొనసాగింది. కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు అంజిరెడ్డి. యాదగిరి, ముత్యాలు గౌడ్, మురళి చారి, తదితరులు పాల్గొన్నారు.

41 రోజులు శ్రీరామకథామృతం

నారాయణఖేడ్: ఖేడ్ భూమయ్య కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ మాస పర్వకాలాన్ని పురస్కరించుకుని 41 రోజుల పాటు రోజూ సా.7 గంటల నుంచి రాత్రి 8:30 వరకు శ్రీరామకథామృత కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ బాధ్యులు తెలిపారు. శ్రావణ భక్తి కోసం శ్రేష్ఠమైన పవిత్ర శ్రావణమాసంలో మానవ కర్తవ్యాన్ని ప్రబోధించే శ్రీరామకథ 40 అధ్యాయనాలతో కూడిన రామాయణ గ్రంథ పఠనం ఉంటుందని వివరించారు.

ప్రత్యేక సమావేశం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ ఐదుగుళ్ల పోచమ్మ తల్లి ఆలయంలో బోనాల నిర్వహణకు ఆదివారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, కార్పొరేటర్ బి.పుష్ప పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆగస్ట్ 10న శ్రావణమాస బోనాలు జరిపేందుకు నిర్ణయించారు. బోనాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పలు ఏర్పాట్లు చేయనున్నట్లు కార్పొరేటర్ పుష్ప తెలిపారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

కంగ్టి(నారాయణఖేడ్): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ గ్రూపులో స్పాట్ అడ్మిషన్లు ఉన్నట్లు మండల కేంద్రం కంగ్టిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి తెలిపారు. పదవ తరగతి పాసైన బాలికలు సోమవారం, మంగళవారం నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని పేర్కొన్నారు. గ్రూపులో 29 సీట్లు మాత్రమే ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు టెన్త్ మెమో, టీసీ, బోనాఫైడ్, ఆధార్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ సర్టిఫికేట్లు, 5 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో పాఠశాల సమయంలో రావాలని సూచించారు.

నేడు అన్నదానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు టోల్‌గేట్ సమీపంలోని రామలింగేశ్వర దేవస్థానంలో శ్రావణ సోమవారం పురస్కరించుకొని స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మహేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సోమవారం ఉ. 5:30 నుండి 7:00 వరకు పార్వతీ రామలింగేశ్వర స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అదేవిధంగా అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు.

దత్తగిరిలో కాశి జగద్గురు పూజలు



పూజలు చేసిన కాశి జగద్గురు, పీఠాధిపతులు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దీపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో కాశి జగద్గురు శ్రీశ్రీశ్రీ 1008 చంద్రశేఖర శివాచార్య స్వామి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం రాత్రి ఆశ్రమానికి వచ్చిన ఆయనకు ఆశ్రమ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆశ్రమంలోని జ్యోతిర్లింగాల వద్ద అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజలు చేశారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు పూలమాల, శాలువాతో సన్మానించి, జ్ఞాపి కను అందజేశారు. దత్తగిరిలో ఉచితంగా వేద పాఠశాల కొనసాగించటంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ108వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహరాజ్, డా.సిద్ధేశ్వర స్వామి, మాతృశ్రీ అనసూయమాత పాల్గొన్నారు.

సన్నాహక సభకు తరలిరండి

జహీరాబాద్: సంగారెడ్డిలో ఎమార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సోమవారం వికలాంగులు, చేయూత పెన్షన్ దారుల కోసం నిర్వహించ తలపెట్టిన సన్నాహక సభకు భారీగా తరలివెళ్లాలని ఆయా సంఘాల నాయకులు కోరారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఎమార్పీఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఉల్లాస్ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకుడు ఆర్. నర్సింహులు మాట్లాడారు. పెన్షన్‌దారుల సంక్షేమంపై అధికార, ప్రతిపక్షానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌లను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలను నిలదీసేందుకు గాను మందకృష్ణ ఆందోళనకు పూనుకుంటున్నారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వికలాంగులు, ఒంటరి మహిళలు, నేత, గీత కార్మికులు, పెన్షన్ దారులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు జయరాజ్, నిర్మల్ మాదిగ, రాజు, మున్నిభాయ్, ప్రదీప్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం కూడా విధుల నిర్వహణ



ఆదివారం పనులు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

న్యాల్‌కల్(జహీరాబాద్): సెలవు దినమైన ఆదివారం కూడా తహసీల్దార్ కార్యాలయంలో కార్యకలాపాలు కొనసాగాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఆర్ఐ శ్యామ్‌రావు, సిబ్బంది తదితరులు రోజు మాదిరిగానే కార్యాలయానికి వచ్చారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను జారీ చేశారు. ఆదివారం మాదిరిగా ఇతర సెలవు రోజుల్లో కూడా ఇలాగే పని చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

అధ్వానంగా రహదారులు



బురదనీటితో గుంతలమయంగా రోడ్డు

సంగారెడ్డి టౌన్ : మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లపై గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఇరిగిపల్లి గ్రామానికి వెళ్లే రహదారి నీటితో నిండి రహదారంతా గుంతలుగా మారింది. రాత్రి సమయాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మరమ్మతులు చేయించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెరవేరనున్న బూర్దిపాడ్ ప్రజల కల

- ముమ్మరంగా సాగుతున్న బీటీ రోడ్డు పనులు
- రూ.3.58 కోట్ల నిధులతో నిర్మాణం



నాణ్యత పనులను పరిశీలిస్తున్న అధికారులు

జహీరాబాద్: దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న బూర్దిపాడ్ రహదారి నిర్మాణం పనులు ఎట్టకేలకు చేపట్టారు. దీంతో ప్రజల ఇబ్బందులు శాశ్వతంగా తీరనున్నాయి. 65వ జాతీయ రహదారి నుంచి బూర్దిపాడ్ గ్రామం మీదుగా కొత్తూర్(బి) గ్రామం వరకు రహదారి నిర్మాణానికి దశాబ్ద కాలం క్రితం ప్రతిపాదించారు. నిధుల కేటాయింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతూ వచ్చింది. ప్రజల కోరిక మేరకు గత రెండేళ్ల క్రితం నిధులు మంజూరయ్యాయి. పలు కారణాల చేత పనులు చేపట్టలేదు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి గత రెండు నెలల క్రితం గ్రామానికి బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఐదు కిలోమీటర్ల మేర రహదారితో పాటు కల్వర్టు నిర్మాణం పనుల కోసం ఎంఆర్ఆర్ పథకం కింద రూ.3.58 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ రహదారిని రెండు బిట్లుగా విభజించి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. కొత్తూర్(బి) నుంచి బూర్దిపాడ్ గ్రామం వరకు 3 కిలోమీటర్ల మేర రహదారి, కల్వర్టు నిర్మాణం కోసం రూ.2.08 కోట్లు మంజూరయ్యాయి. 65వ జాతీయ రహదారి నుంచి బూర్దిపాడ్ గ్రామం వరకు 2 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం 1.50 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం కొత్తూర్(బి) వైపు నుంచి పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే 80 శాతం మేర పనులు పూర్తయ్యాయి. నెల రోజుల్లో పనులు అధికారులు ప్రయత్నిస్తున్నారు. రెండు వైపు రహదారి నిర్మాణం పనులు సైతం త్వరలో ప్రారంభింపజేస్తామని పేర్కొంటున్నారు.